# ప్రాణం తీసిన నీటికుంట

**ఇద్దరు బాలికలు మృతి - యాటకల్లులో విషాదం..!**

**ప్రజాశక్తి కళ్యాణదుర్గం**

పాఠశాలకు సెలవులను సరదాగా బంధువుల ఇంట్లో గడిపేందుకు వెళ్లిన వారిని అనుకోని ప్రమాదం వెంటాడింది. దుస్తులను శుభ్రం చేసేందుకు నీటికుంట వద్దకెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడడంతో ఇద్దరు యువతులు మృతి చెందారు. ఈ విషాధ ఘటన అనంతపురం జిల్లా శెట్టూరు మండలం యాటకల్లు గ్రామం అడవి గొల్లపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కళ్యాణదుర్గం మండలం గోల్ల గ్రామానికి చెందిన జయంతి (16), చేపల గ్రామానికి చెందిన దర్శిని(8) ఇద్దరూ సెలవులు కావడంతో యాటికల్లు గ్రామంలోని వారి బంధువులు ఇంటికి వెళ్లారు. దుస్తులు శుభ్రం చేసేందుకు సోమవారం ఉదయం సమీపంలోని క్వారీ కుంట వద్దకు ఇద్దరూ వెళ్లారు. దుస్తుల శుభ్రం చేస్తున్న సమయంలో బాలికలు ప్రమాదవశాత్తు నీటికుంటలో పడ్డారు. ఈతరాకపోవడంతో ఇద్దరూ నీటిలో ఊపిరాడక మరణించారు. ఇంటి వద్ద జయంతి, దర్శిని కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు వారి కోసం గాలించారు. నీటి కుంట వద్ద బట్టలు ఉండడంతో అనుమానం వచ్చి నీటిలో గాలించారు. నీటిలో ఉన్న ఇద్దరిని బయటకు తీయగా అప్పటికే వారు మరణించారు. విఘతజీవులుగా పడివున్న వారిని చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అమిలినే సురేంద్రబాబు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు.

మృతి చెందిన జయంతి, దర్శనిలు

**నీటి తొట్టెలో పడి బాలుడు మృతి**

**బ్రహ్మసముద్రం :** నీటి తొట్టెలో పడి మూడేళ్ల బాలుడు మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలోని ఎరడికెర గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. ఎరడికెర గ్రామానికి చెందిన శివలింగమ్మ, నాగరాజు దంపతుల కుమారుడు హర్షవర్ధన్(3) ప్రమాదవశాత్తూ ఇంటిముందు ఉన్న నీటి తొట్టెలో పడిపో యాడు. ఎంతసేపైనా బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెతకగా నీటితొట్టెలో అపస్మారక స్థితిలో కనిపించాడు. దీంతో బాలుడిని హుటాహుటిన స్థానిక పిహెచ్‌సికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. బాలుడు మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

జెడ్పీలో జరిగిన సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

# 'ఆర్డీటీని కాపాడుకుందాం'..!

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఆర్డీటీని కాపాడుకుందాం అంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అందరి నోటా ఒకే మాట విన్పిస్తోంది. ఆర్డీటీని కాపాడండి అంటూ అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాలూ కోరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎని పునరుద్ధరించాలని అడుగుతున్నారు. ఎఫ్‌సిఆర్‌ఎ నిధులు రాకుండా నిలిపేయడంపై 'ఆర్డీటీకి బిజెపి బ్రేక్' అని ఈ నెల 15వ తేదీన ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వచ్చింది. ఈ కథనం వెలువడగానే దీనిపై ప్రజా ఉద్యమం ఆరంభమైంది. గత కొన్ని రోజులుగా అందరూ ఆర్డీటీ సేవలను గుర్తించి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం నాడు జిల్లా పరిషత్ కార్యాలయం హాలులో 'సేవ్ ఆర్డీటీ' పేరుతో సిపిఐ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల సమావేశం జరిగింది. మరోవైపు ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో సిసిసి ఛైర్మన్ షకీల్ షఫి ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆదివారం నాడు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమాలు అన్నింటిలోనూ అన్ని రాజకీయా పార్టీలు, ప్రజా సంఘాలు 'సేవ్ ఆర్డీటీ' అంటూ నినదించాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, నగర మేయరు వసీం, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, వికె.మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ వికె.రంగారెడ్డి, మాజీ మేయర్ స్వరూప, టౌన్ బ్యాంకు అధ్యక్షులు జెఎల్.మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు ఆర్డీటీ సేవలు, అది లేకపోతే కలిగే నష్టాలను తెలియజేశారు.

**ఆర్‌డిటి సేవలకు బిజెపి బ్రేక్..!**

- ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ పునరుద్ధరణ నిలిపివేత
- ఆగిపోనున్న సేవలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాకు కల్పతరువుగా ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) సేవలకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకట్టవేసింది. ఆ సంస్థకు సంబంధించి నిధుల వినియోగానికి అవసరమైన ఎఫ్‌సిఆర్‌ఎ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్టు) కింద అనుమతుల పునరుద్ధరణను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ఫలితంగా ఇప్పటి వరకు ఆర్‌డిటి సంస్థ ద్వారా అందుతున్న సేవలకు బ్రేక్ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా విదేశీ నిధులతో నడుస్తున్న స్వచ్ఛంద సంస్థలపై బిజెపి ప్రభుత్వం కత్తికట్టిందన్న ఆరోపణలున్నాయి. ఇది వరకే ఆర్‌డిటికి విరాళాలు అందిస్తున్న విదేశీ సంస్థలపై నిషేధం విధించింది. దీనివల్ల ఏటా ఆర్‌డిటికి విరాళంగా వస్తున్న నిధుల్లో కోతపడింది. తాజాగా ఇప్పుడు లైసెన్సు పునరుద్ధరణ ఆపివేయడంతో నిధుల వినియోగంపైనా ప్రభావం పడనుంది.

**ఏటా రూ.500 కోట్లకుపైగా బడ్జెట్ .?**

1969లో అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి ప్రారంభమైంది. అప్పటి నుంచి సేవలను విస్తరిస్తూ అనంతపురం జిల్లాలో ఒక భాగమైంది. క్రమంగా విస్తరిస్తూ రాష్ట్రంలో కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ జిల్లాల్లో సేవలను అందిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో భూపాల్‌పల్లి, నాగర్‌కర్నూలు, నల్గొండ జిల్లాల్లో సేవలను అందిస్తోంది. ఏడాదికి సగటున రూ.500 కోట్లకుపైగా బడ్జెట్ ఉంటుంది. గతేడాది నుంచి ఈ సంస్థకు వచ్చే విరాళాలపై కేంద్రం నిషేధం విధించడంతో చాలా వరకు సేవలను ఈ సంస్థ తగ్గించుకుంటూ వస్తోంది. ఇక రెన్యువల్ జరగకపోతే పూర్తి స్థాయిలో సేవలు ఆగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఆర్‌డిటి ద్వారా అందుతున్న సేవలు**

అనంతపురం జిల్లాలో ఏ గ్రామానికి వెళ్లినా బలహీన వర్గాలు, దళిత, గిరిజనులకు ఆర్‌డిటి కట్టించిన ఇళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు లక్ష వరకు ఇంటి నిర్మాణాలను చేశారు. అవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం పెద్దఎత్తున కృషి చేశారు. స్పోర్ట్సు కాంప్లెక్సు ద్వారా గ్రామీణ క్రీడాకారులను తీర్చిదిద్దే కార్యక్రమాలు ముమ్మరంగా నడుస్తూ వస్తున్నాయి. వైద్యపరంగాంలోనూ విశిష్టమైన సేవలను అందిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్ ప్రాంతాల్లో మూడు ఆసుపత్రులున్నాయి. 532 పడకలతో ఈ ఆస్పత్రుల ద్వారా సేవలను అందిస్తున్నారు. ఇవి కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో క్లినిక్‌లు, మొబైల్ క్లినిక్‌లు నడుస్తున్నాయి. ఇంత పెద్దఎత్తున సేవలందిస్తున్న ఈ సంస్థపై బిజెపి ప్రభుత్వం వేటు వేసేందుకు సిద్ధపడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ నిధులు ఆపడంపై 'ఆర్డీటీ సేవలకు బిజెపి బ్రేక్' పేరుతో ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన కథనం

**ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణకు ప్రయత్నిస్తాం**
**అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపి**

ఆర్డీటీ సంస్థ విద్య, వైద్య రంగాలతో పాటు జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పాత్రను పోషిస్తోంది. 1969 నుంచి ఆ సంస్థ ప్రజల్లో ఒక్కటై పనిచేస్తోంది. ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణ నిలిపివేయడంతో జిల్లావాసులకు నష్టం జరుగుతుంది. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వరకు తీసుకెళ్లి సేవలు యథావిధిగా కొనసాగించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తాం.

◆ అందరి నోటా అదేమాట
◆ ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాల్సిందే..
◆ అఖిల పక్ష, ప్రజా సంఘాల డిమాండ్

**కేంద్రంతో మాట్లాడుతాం**
**బికె.పార్థసారథి, హిందూపురం ఎంపి.**

ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణకు తమ వంతు ప్రయత్నం చేస్తాం. ఆ సంస్థ దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో ప్రజలతో కలసి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. గృహ నిర్మాణాలు మొదలుకుని, మహిళల సమస్యలు అన్నింటిలోనూ పనిచేస్తోంది. అలాంటి సంస్థకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఆ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరణ చేసేలే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం.

**ఆర్డీటీ భాగస్వామ్యాన్ని గుర్తించండి**
**వై.విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే.**

ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో ఆర్డీటీ భాగస్వామ్యం ఎనలేనిది. దీన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. ఈ సంస్థ అనేక సంవత్సరాలుగా ఈ జిల్లా అభివృద్ధిలో ఎంత కీలకంగా పనిచేస్తోంది. అటువంటి సంస్థకు ఆడిట్‌లో లోపాలను చూపించి నిధులు ఆపడం సరైంది కాదు. ఈ సమస్యను తాము కూడా తమ పార్టీ పార్లమెంటరీ నాయకుడైన మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి ఆర్డీటీకి తిరిగి విదేశీ నిధుల విడుద అయ్యేలా కృషి చేస్తాం.

**'సేవ్ ఆర్డీటీ' సోషియల్ మీడియాలో ప్రచారం**
**వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**

ఆర్డీటీ సంస్థ సేవలు ఒక్క అనంతపురం జిల్లాలోనే కాదు. రాయలసీమ జిల్లాలతోపాటు, నెల్లూరు, ప్రకాశ జిల్లాల్లోనూ నడుస్తున్నాయి. తెలంగాణలోనూ సేవలందిస్తోంది. గుజరాత్‌లో భూకంపం వచ్చిన సమయంలోనూ అక్కడికెళ్లి సేవలందించింది. అటువంటి సంస్థపై కర్నూలులో ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో నిధులు నిలిపివేయడం సరైంది కాదు. ఈ సంస్థను కాపాడాలని మంగళవారం నాడు సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేపట్టాలని ప్రజా సంఘాల సమావేశంలో నిర్ణయించాం. మంగళవారం నాడు పెద్దఎత్తున సేవ్ ఆర్డీటీ అన్న నినాదాన్ని ప్రతి ఒక్కరూ హోరెత్తించాలి.

**ఆర్డీటీని కాపాడుకుందాం**
**జగదీశ్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు.**

ఆర్డీటీ సంస్థ జిల్లాలో ఒక భాగమై ఉంది. విద్య, వైద్యమే కాకుండా మహిళా అభివృద్ధి, గృహనిర్మాణాలు అనేక రకాలుగా పనిచేస్తోంది. అటువంటి సంస్థకు సాంకేతిక కారణాలను చూపి నిధులు రాకుండా నిలుపుదల చేయడం సరైంది కాదు. ఆ సంస్థను కాపాడుకునేందుకు అందరూ కలసిరాలి.

## అర్జీలపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

వివిధ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా౹౹వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఒ ఎ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్‌లు తిప్పేనాయక్‌తో కలిసి ప్రజల నుంచి 445 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పులను తీసుకురావాలని అర్జీదారులకు సూచించారు. సివిల్ సర్వీస్ పరీక్షల్లో పాల్గొనే అభ్యర్థులకు మే 4వ తేదీన ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో మంచి మార్కులు తెచ్చుకున్న వారికి 20 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఒ రామచంద్ర రెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడు, డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నూతన అసిస్టెంట్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వం అనంతపురం జిల్లాకు నూతన అసిస్టెంట్ కలెక్టర్‌ను కేటాయించింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో నూతన అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ డా౹౹వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను కలిసి పూల మొక్క అందజేశారు. రాజస్థాన్‌కు చెందిన సచిన్ రహర్ 2024 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందినవారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

## 'శ్రీరామిరెడ్డి' కార్మికుల పోస్ట్‌కార్డు ఉద్యమం

పోస్ట్ కార్డు ఉద్యమానికి మద్దతు తెలుపుతున్న నాయకులు

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మండలంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా పోస్ట్‌కార్డు ఉద్యమానికి అనూహ్య స్పందన లభించినట్లు ఆ శాఖ జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి తెలిపారు. బ్రహ్మసముద్రంలో సోమవారం వారికి పలువురు మద్దతు తెలిపారు. వన్నూరుస్వామి మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ 20 రోజులుగా నిరవధిక సమ్మె చేపట్టగా అధికారులు కానీ, కాంట్రాక్టర్ కానీ స్పందించలేదన్నారు. దీంతో సిఎం చంద్రబాబుకు వారి సమస్యలు తెలిపేందుకు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ క్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు స్థానిక పోస్టాఫీస్‌కు వెళ్లి పోస్టుకార్డులు పంపారు. వారికి గ్రామస్తులు మద్దతు తెలిపారు.

## సబ్సిడీ విత్తనాలు కేటాయింపు

**ప్రజాశక్తి-అనంతపురం**

ఖరీఫ్ సీజన్‌కు విత్తన కేటాయింపులు జరిగాయి. జిల్లాలో 54,184 క్వింటాళ్ల కేటాయింపులు జరిగాయి. ఇందులో వేరుశనగ విత్తనకాయలు 50,592 క్వింటాళ్ల కేటాయించింది. కంది విత్తనాలు 2380 క్వింటాళ్లు, వరి 800 క్వింటాళ్లు, మినుములు 36 క్వింటాళ్లు, పెసలు 60 క్వింటాళ్లు, అలసంద 60 క్వింటాళ్లు, రాగి నాలుగు క్వింటాళ్లు, కొర్ర 45 క్వింటాళ్లు, దాంచియ 190 క్వింటాళ్లు, సన్‌హెంప్ రెండు క్వింటాళ్లు, పిల్లిపెసర 15 క్వింటాళ్ల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. విత్తనాలకు సంబంధించి ఇంకా సబ్సిడీ ధరలు ఖరారావ్వాల్సి ఉంది.

## ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్ష

**ప్రజాశక్తి-రాయదుర్గం**

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయుఎ) డిపో కార్యదర్శి హెచ్.తిప్పేస్వామి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఎన్‌ఎంయుఎ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షులు ఎంఎండి.షఫీ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నాల్గో విడత ఉద్యమంలో భాగంగా రెండు రోజులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఇకనైనా యాజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిచో మున్ముందు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవినాయక్, జాయింట్ సెక్రెటరీ సిద్దేసులు, డిపో ప్రెసిడెంట్ జిలాన్, గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్, ట్రెజరర్ కుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ రమేష్, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, రామాంజనేయులు, రవీంద్రనాథ్, మాలిక్‌బాషా, విజయ్‌కుమార్, రాజు, తిరుపాల్, వలి, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ సెల్‌లో మజ్జిగ పంపిణీ

**బొమ్మనహాల్ :** రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం తహశీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఎండ తీవ్రత దృష్ట్యా అర్జీదారులకు తహశీల్దార్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయించారు.

## 10 నుంచి ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని సమూహ దేవాలయాల ఈవో కె.నరసింహారెడ్డి కోరారు. మే 10 నుంచి 20వ తేదీ వరకూ బ్రహ్మోత్స వాలు జరగనున్న నేపథ్యంలో సోమవారం ఈవో అధ్యక్షతన ఆలయ ఆవరణలో సమావేశం నిర్వహిం చారు. పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ ఆలయ హుండీల సొమ్ము, గదుల అద్దె, ఇతర సేవల సొమ్ముతో పాటు దాతల సహకారం అవసరమన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, భక్తులందరికీ ప్రసాదం అందేలా చూడాలన్నారు. మే 15వ తేదీ శ్రీవారి కల్యాణోత్సవం, 17న బ్రహ్మరథోత్సవం జరుగుతాయన్నారు. సమావేశంలో నాయకులు గౌని ఉపేంద్రరెడ్డి, నల్లపూల వెంకటేశులు, చుంచుల నాగప్ప, ప్రశాంతి, హనుమంతు, భారతి, దేవిరెడ్డిపల్లి రాజేష్, సత్యనారాయణ, ఆర్ఎస్ హులికుంటి మూర్తి, అంబాజీరావు, వివిధ ఆలయ కమిటీల ప్రతినిధులు, అర్చకులు పాల్గొన్నారు.

# పన్ను డిమాండ్ నోటీసుల జారీలో నిర్లక్ష్యం

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లలో కొండల పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిల వసూళ్లకు ప్రభుత్వం పన్ను రాయితీలను ఇస్తోంది. అయితే సంబంధిత సిబ్బంది సకాలంలో డిమాండ్ నోటీసుల జారీకి చర్యలు చేపట్టకపోవడంతో ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం నెరవేరేనట్టు కనిపించడం లేదు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టరేట్ నుంచి ఈనెల 20వ తేదీన డిమాండ్ నోటీసులు విడుదల చేశారు. ఈఆర్‌పి మాడ్యూల్ నుంచి డిమాండ్ నోటీసులను మున్సిపాల్టీలవారీగా జనరేట్ చేసుకుని ప్రింటింగ్‌కు ఇచ్చి ఈనెల 26వ తేదీన అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నాయి. జిల్లాలో ఇంకా కొన్ని మున్సిపాల్టీలకు సంబంధించి డిమాండ్ నోటీసులు ఇంకా ప్రింటింగ్ దశలోనే ఉన్నాయి. వాటిని క్రమ సంఖ్య వారీగా పేర్చుకొని సచివాలయాల నుంచి పంపిణీ చేయడానికి అడ్మిన్లు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంత కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో డిమాండ్ నోటీసులు సోమవారం రోజున చిందర వందరగా పడి ఉన్నాయి. వాటిని క్రమ సంఖ్యలో అమర్చుకునేందుకు సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 30వ తేదీకి ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలు, రాయితీల గడువు ముగియనుంది. పన్ను ఎంత చెల్లించాలో తెలిపే డిమాండ్ నోటీసులు అందిన తర్వాతనే ఇంటి, కొళాయి గుత్తలు చెల్లిద్దామని కొందరు గృహ యజమానులు వేచి చూస్తున్నారు. నగరంలో 62,000 ఆస్తి పన్ను అసెస్మెంట్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో ఇంకా చాలా వరకు పన్నులు వసూలు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోనే డిమాండ్ నోటీసులు ఇంకా ఉన్న నేపథ్యంలో గడువు ఉన్న ఈ రెండు రోజుల్లో ఏ మేరకు వాటిని అధికారులు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతిఏటా 15 శాతం ఆస్తి పన్ను పెరుగుదల ఉండటంతో పన్ను ఎంత చెల్లించాలి అన్న సందిగ్ధం గృహ యజమానుల్లో కన్పిస్తోంది. టైటిల్ ట్రాన్స్‌ఫర్లు, ఆస్తి పన్ను నిర్ధారణ తదితర పనులన్నీ నత్తనడకనే సాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలను ఉపయోగించుకుని పన్ను లక్ష్యాలను కార్పొరేషన్ యంత్రాంగం ఈ రెండు రోజుల్లో ఏ మేరకు చేరుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

రెవెన్యూ విభాగంలో పడి ఉన్న డిమాండ్ నోటీసులు

◆ కార్పొరేషన్ కార్యాలయానికే పరిమితమైన నోటీసులు
◆ రెవెన్యూ విభాగంలో చిందరవందరగా పడిఉన్న పత్రాలు
◆ సచివాలయల వారీగా సేకరణకు ఇబ్బందులు

## సబ్ రిజిస్ట్రార్ అవినీతి, అక్రమాలపై రాస్తారోకో

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

సబ్ రిజిస్ట్రార్ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతి, అక్రమాలకు అంతేలేకుండా పోయిందన్నారు. లంచం ఇస్తే ఏ పత్రాలు చూడకుండా రిజిస్టర్ చేస్తారని, ఇవ్వకపోతే ఏ ఫైలైనా పక్కన పెడతారని ఆరోపించారు. గ్రామాల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి గ్రామకంఠాల్లో ఉన్న ఇళ్లను రిజిస్టర్ చేయడానికి రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారన్నారు. రూ. లక్షలు లంచం తీసుకుని నిబంధనలను తుంగలో తొక్కి ఎన్ఒసి లేని భూములు, ప్రభుత్వ భూములు, దేవాదాయ భూములను సైతం రిజిస్టర్ చేస్తున్నారన్నారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పించారు. వీరి ఆందోళనకు పట్టణ న్యాయవాది ఆర్‌కె.అలెగ్జాండర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుళ్లాయప్ప, తిప్పేస్వామినాయక్, దళిత జన జాగృతి ఆర్‌కె.రాజు, ఎల్‌ఆర్‌ఎఫ్ ఓబులేష్, జై భీమ్ విలియమ్స్, సాకే గురుమూర్తి, కుళ్లాయప్ప, గోవిందప్ప, తిమ్మరాజులు, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మౌలిక వసతులు కల్పించండి

**మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల మొర**

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని పలువురు కౌన్సిలర్లు అధికారులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో నాలుగైదు రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని కనీసం మూడు రోజులకు ఓ సారి అందించాలని కోరారు. డ్రెయినేజీ కాలువలు దోమలకు ఆవాసాలుగా మారాయని ఫాగింగ్ చేయాలన్నారు. వచ్చేది వర్షాకాలం కావున కాలువల్లో యుద్ధప్రాతి పదికన పూడికను తీసి పల్లపు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చూడాలన్నారు. పలుచోట్ల వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. వారపు సంత మార్కెట్, బళ్లారి బస్టాండ్, లక్ష్మీబజార్, తదితర ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. కుక్కల బెడద నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. గంగమ్మ బావి వద్ద నకిలీ ఇంటి పట్టాను రద్దుచేసి, అక్కడ ఆర్ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. అజెండాలోని అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇంజినీర్ రవిప్రకాష్‌నాయుడు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ మురళీమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ఏఈలు నరసింహులు, ప్రతాప్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

# కౌలు రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన కౌలు రైతు శ్రీరామ్(28) కుటుంబాన్ని ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతు శ్రీరామ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మండలంలో నలుగురు కౌలు రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురై మృతి చెందగా వారికి కౌలు రైతు చట్టం ప్రకారం అందాల్సిన నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మండలంలో సుమారు 5వేల మంది కౌలు రైతులు ఉన్నా వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కౌలు రైతుల సమస్యలను పరిష్క రించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ప్రధానంగా ప్రతి కౌలు రైతుకూ బ్యాంకు రుణం, రైతు భరోసా, పంటల బీమా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సిఐటి నాయకులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా తాడిపత్రి మున్సిపల్ వైస్‌చైర్మన్ల ఎన్నిక

ఎన్నికల అధికారితో నియామక పత్రాలను అందుకుంటున్న వైస్‌చైర్మన్లు షేక్షావలి, తలారి అరుణ

**ప్రజాశక్తి-తాడిపత్రి**

తాడిపత్రి మున్సిపల్ వైస్‌చైర్మన్లను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఎన్నికల అధికారి మల్లికార్జునుడు పర్యవేక్షణలో వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపాలిటీలో 36 మంది వార్డు సభ్యులకు 18 మందిపైగా హాజరు వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. 1వ వైస్ చైర్మన్‌గా 26వ వార్డు టిడిపి కౌన్సిలర్ వెల్లుట్ల షేక్షావలి, 2వ వైస్ చైర్‌పర్సన్‌గా సిపిఐకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ తలారి అరుణను టిడిపి కౌన్సిలర్లు కొత్తపల్లి మల్లికార్జున, విజయకుమార్ బలపరిచారు. పోటీలో ఎవరూ లేకపోవడంతో వారిద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి మల్లికార్జునయుడు నియమితులైన వారికి నియామక పత్రాలను అందజేశారు. తలారి అరుణ సిపిఐకి చెందిన కౌన్సిలర్ అయినప్పటికీ ఆ పార్టీ ఎ, బి పత్రాలు సమర్పించినందున ఇండిపెండెంట్ 2వ వైస్‌చైర్‌పర్సన్‌గా ప్రకటించారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. తర్వాత వైస్‌చైర్మన్లు కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# గిట్టుబాటు ధరతో వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలి

## సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు

**ప్రజాశక్తి-శింగనమల**

రైతులు పండించిన వరిధాన్యాన్ని గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని పలుచోట్ల కళ్లందొడ్లలో ఉన్న వరిధాన్యాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వరుస కరువులతో రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ముఖ్యంగా మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు వరిపంటను సాగు చేశారన్నారు. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మండలవ్యాప్తంగా కూలీలు వలసలు వెళ్లకుండా అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. అంతేగాకుండా సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించి రూ.600 కనీస కూలి పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, కుళ్లాయిస్వామి, పుల్లయ్య, సూర్యప్రకాష్, సుంకన్న, రామాంజనేయులు, జయరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, నాగరాజు, సావిత్రి, ఆదినారాయణ, సూర్యనారాయణ, రామాంజి, సంధ్యారాణి, సుబ్బమ్మ, నిర్మల, సుధారాణి, కిష్టన్న, ధనలక్ష్మి, వీరాంజి, నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఎలుకల ఘటనపై కఠిన చర్యలు : ఎమ్మెల్యే

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం**

నగరంలోని కెఎస్ఎన్ కళాశాలలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈమేరకు సోమవారం కళాశాలకు చేరుకున్న ఎమ్మెల్యే ఎలుకల ఘటనపై విద్యార్థినులతో ఆరాతీశారు. తర్వాత కళాశాల ఆవరణ, వసతి గృహం చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఒక్కో రూములో 20 మంది వరకూ ఉంటున్నామని, తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే ఎదుట విద్యార్థినులు వాపోయారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ రెండు రోజుల్లో తాగునీటి పైప్‌లైన్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తర్వాత వంట గదిలో అపరిశుభ్ర ఉండటంపై సిబ్బందిని మందలించారు. ఇలాంటి పరిస్థితి ఉంటే విద్యార్థులు అనారోగ్యానికి గురికారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతినెలా ఎప్పుడైనా వస్తానని, ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఇండియా డిజైన్ వీక్‌లో 'గేట్స్' ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**ప్రజాశక్తి-గుత్తి**

చెన్నైలో నిర్వహించిన ఇండియా డిజైన్ వీక్ 2025(సౌత్ రీజియన్) గ్రాండ్ ఫైనల్స్‌లో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఔత్సాహిక ఇంజినీర్లు తమ సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ఐసిటి అకాడమీ, ఆటో డెస్క్ కంపెనీ సంయుక్తంగా ఇండియా డిజన్ వీక్ నిర్వహించారని తెలిపారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌ను కీలక సాధనంగా ఉపయోగించి వాస్తవ ప్రపంచ సవాళ్లకు వినూత్న పరిష్కారాలను రూపొందించడానికి దేశంలో ఇది ఒక పెద్ద వేదికని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐసిటీ అకాడమీ సభ్య దక్షిణ భారత ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన 150 పైగా బృందాలు పాల్గొన్నట్లు వివరించారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన బాల ఆదిత్య, మహమ్మద్ సోహెల్, విశ్వనాథ్, జగన్మోహన్ రెండు బృందాలుగా కార్యక్రమంలో పాల్గొని రోబోటిక్ ఆర్మ్ అనే అంశాన్ని ప్రదర్శించి అవార్డును కైవాసం చేసుకున్నారని తెలిపారు. సోమవారం గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఖాయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# దారి సమస్య పరిష్కరించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**

పొలానికి వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం గంగాదేవిపల్లి గ్రామ రైతులు తహశీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలోని గంగాదేవి పల్లి గ్రామంలో బ్రిటిష్ కాలం నాటి నుండి హద్దులు ఏర్పరచుకుని ఉన్న దారిని ఇప్పుడు కొందరు వ్యక్తులు రౌడీయిజం చేస్తూ అడ్డగించారన్నారు. కావున రికార్డులను పరిశీలించి దారి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంగాదేవిపల్లి బాధిత రైతులు నరసింహారెడ్డి, గంగాశేఖర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రమేష్, రత్నమయ్య, గంగన్న, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

**పెద్దవడుగూరు :** గ్రామాల్లో బాల్య వివాహాలను నిర్మూలించాల్సించిన బాధ్యత మనందరిపై ఉందని వెలుగు ఎపిఎం బలీల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. సోమవారం మండల కేంద్రమైన వెలుగు కార్యాలయంలో సోమవారం బాల్యవివాహాలు, పోక్సో చట్టం, కిషోర వికాసం కార్యక్రమాలపై మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ చిన్నవయస్సులో బాలికలకు పెళ్లి చేయడం వల్ల వచ్చే నష్టాలు, అనర్థాలపై వివరించగా సమాజంలో మహిళల హక్కులు, బాలకలపై జరుగుతున్న అగయిత్యాలను ఆరికట్టేందుకు దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు శంకర, పులిశేఖర, ప్రవీణ, రమానంద్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్థికసాయం

**పుట్లూరు :** అనంతపురం నుంచి నేపాల్ దేశానికి సైకిల్ యాత్ర చేపట్టిన సమీరాఖాన్‌కు శింగనమల నియోజకవర్గంలోని సప్తగిరి క్యాంపర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ రూ.లక్ష ఆర్థికసాయం అందజేసింది. ఈమేరకు సోమవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సంబంధిత మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి సంస్థ యాజమాన్యం వైస్ ఛైర్మన్ హనీఫ్ పాల్గొన్నారు.

# తిమ్మంపల్లిలో కార్డెన్‌సెర్చ్

**యల్లనూరు :** ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామంలో సోమవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారి ఇళ్లు, కళ్లం దొడ్లు, గడ్డివాముల్లో సోదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఎఎస్ఐ సంపత్‌కుమార్, నారాయణరెడ్డి, జెమిందార్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

# 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## కలెక్టర్‌ను కోరిన ప్రజాసంఘాల నాయకులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గేయానంద్, నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఉమ్మడి అనంతపురము జిల్లాలోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 600 మంది కార్మికులు 16నెలలుగా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. అలాంటి కార్మికులు సుమారు 24రోజులుగా సమ్మె చేస్తున్నా అటు అధికారులుగానీ, ఇటు ప్రభుత్వంగానీ పట్టించుకోలేదన్నారు. కార్మికుల సమ్మె కారణంగా 850 గ్రామాలకుపైగా తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. కార్మికులకు వేతనాలతోపాటు పిఎఫ్ మొత్తాలను చెల్లించకుండా సంబంధిత కాంట్రాక్టర్ వేధిస్తున్నారన్నారు. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ బకాయిలు ఉన్న మాట వాస్తవమే అని.. అయితే వారంరోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కౌలు రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, జెవివి నాయకులు ఎం.బాల రంగయ్య, కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.నాగేంద్రకుమార్, వై.బాలకృష్ణ, వెంకటేష్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దళితవాడలు, గిరిజన తండాల్లో సమస్యలు పరిష్కరించాలి

## సామాజిక చైతన్య యాత్రలో వచ్చిన అర్జీలపై కలెక్టర్‌కు వినతి

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలోని దళితవాడలు, గిరిజన కాలనీలు, తండాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి కనీస సౌకర్యాలు మెరుగు పర్చాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్రలో భాగంగా యాత్రలో నాయకుల దృష్టికి వచ్చిన సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 మండలాలు, 38 గ్రామాల దళితి వాడలు, 14 సంక్షేమ హాస్టళ్లలను మా బృందం పరిశీలించిందన్నారు. కుల వివక్షతో ఉపాధి, కనీస సౌకర్యాలు అందక అనేక సమస్యలతో దళితులు, వెనుకబడిన వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లు, మురుగు కాలువలు, బస్సు రవాణా సౌకర్యం, విద్యుత్ సమస్యలు, తాగునీటి సమస్య, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ఉపాధి బకాయి బిల్లులు, వైద్య సదుపాయం, అనేక సమస్యల ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి దళిత గిరిజన కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. భూమి లేని నిరుపేదలకు 3 ఎకరాలు భూమి ఇవ్వాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వమే నడపాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వం నియంత్రణ పెంచాలన్నారు. ఈ సంస్థల వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినమ్మ, జిల్లా కోశాధికారి చంద్రిక, అశ్విని, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

# టాటా ఇంప్రింట్స్‌తో 'సంసిధ్' ఒప్పందం

ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

**ప్రజాశక్తి-అనంతపురం**

సుదీర్ఘమైన విద్యా విధానంతో సంసిధ్ గ్రూప్ ప్రముఖ సంస్థ టాటా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక సప్తగిరి సర్కిల్ లోని అలెగ్జాండర్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఒప్పందాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో గొప్ప సంస్థగా ఎదిగిన టాటా సంస్థతో సంసిధ్ గ్రూపు ఒప్పందం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. సంసిధ్ గ్రూప్ ఛైర్మన్, ఫౌండర్ వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ టాటా ఒప్పందం ఎంతో గొప్పదన్నారు. 15ఏళ్ల నుంచి 12 వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఉందన్నారు. ఇండియా మొత్తంగా సృజనాత్మకమైన విద్యా విలువలతో అందిస్తున్నామని తెలిపారు. సంసిధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, టాటా ఇంప్రింట్స్ మధ్య అద్భుతమైన కొత్త సహకారాన్ని అందిస్తున్నామని తెలిపేందుకు సంతోషిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంసిధ్ గ్రూప్ డైరెక్టర్ గోవిందరాజన్, అద్వాజ గ్రోత్ ఇన్నోవేషన్ హెడ్ వాసా చైతన్య సిద్ధార్థ, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ మేనేజర్ అజ్మద్ ఫాషా, వైస్ ప్రిన్సిపల్ మధుమిక, శ్రీవాణి, రాజశేఖర్ దామోదర్ రెడ్డి, రుక్సానా పలువురు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ మెరుగుదలకు సమన్వయంతో పని చేయండి

## ఎస్పీ పి.జగదీష్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

**ప్రజాశక్తి -అనంతపురం క్రైం**

అనంతపురం నగరంలో ట్రాఫిక్ మెరుగుదలకు అంకితబావం, సమన్వయంతో పని చేయాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ కన్వెన్సన్ హాలులో ట్రాఫిక్, నగర పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా క్లాక్‌టవర్, శ్రీకంఠం సర్కిల్, సప్తగిరి సర్కిల్, తాడిపత్రి బస్టాండు, పాతవూరు, గాంధీబజార్, ఎన్టీఆర్ సర్కిల్, చంద్ర హాస్పిటల్ సర్కిల్, రుద్రంపేట సర్కిల్, బళ్లారి బైపాస్ కూడళి, జాతీయ రహదారిపైకి కలిసే సర్వీసు రోడ్లు, ప్రధాన రహదారులపై కొనసాగుతోన్న వాహనాల రాకపోకలు, సిగ్నల్స్‌పై సమీక్షించారు. ఆయా కేటాయించిన పాయింట్లలో పక్కాగా విధుల్లో ఉండటంతో పాటు ప్రజలు, వాహనదారులు అసౌకర్యానికి గురికాకుండా యాక్టివ్‌గా పని చేయాలన్నారు.

### ట్రాఫిక్ పోలీసులకు వేసవి సురక్షిత ఉపకరణాలు

ట్రాఫిక్ పోలీసులకు సోమవారం వేసవి సురక్షిత ఉపకరణాలు అందజేశారు. సుమారు 100 మంది సిబ్బందికి కూల్ కళ్లద్దాలు, లీటర్ వాటర్ బాటిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, క్యాప్, తదితర ఉపకరణలు కల్గిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం వేసవి సురక్షిత ఉపకరణాలు అందజేయడానికి సహకరించిన దాతలను ఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో సమావేశంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సిఐలు వెంకటేష్ నాయక్, కనుమూరి సాయినాథ్, రాజేంద్రనాథ్‌యాదవ్, శాంతిలాల్, కిమ్స్ సవీరా ఆసుపత్రి నిర్వాహకులు సురేంద్రరెడ్డి, జోస్ అలుక్కస్ మేనేజర్ అజిష్ మీనన్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ మేనేజర్ రాజేష్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీటీని కాపాడుకుందాం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

అనంతతోపాటు రాయలసీమ జిల్లాల్లో నిరుపేదలకు విశేష సేవలందిస్తున్న ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టం(ఎఫ్‌సిఆర్‌ఎ)ను పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బంగి శివ కోరారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, తాగునీరు, తదితర రంగాల్లో ఆర్‌డిటి సేవలు విస్తరించాయన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా చూడటం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్‌డిటి సంస్థపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయా లని కోరారు.

**యాడికి :** రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) ఎఫ్‌సిఆర్‌ఎను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని టిడిపి, జనసేన నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్‌కుమార్, తిరంపురం నీలకంఠ, నాగమునిరెడ్డి, తాంద్రవిక్రమ్, బద్దెలరాముడు, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, సెల్ పాయింట్ చాంద్‌బాషా, ఫైబర్ చందు, హాజీపీరా, మహమ్మద్ రఫీ, టీ.వెంకటేష్, ఓబన్న, పప్పు వెంకటేష్, నాగరాజు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** ఆర్డీటీ సంస్థకు విదేశీ నిధులను పునరుద్ధరించేంత వరకూ పోరాడుదామని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎక్కడో స్పెయిన్ దేశం నుంచి వచ్చిన ఫాదర్ ఫెర్రర్ ఆర్డీటీ సంస్థను ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవలు చేస్తున్నారన్నారు. అలాంటలి సంస్థలకు విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం కేంద్రానికి మంచిది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని నిస్వార్థంగా పని చేస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించేందుకు కేంద్రంతో మాట్లాడాలని కోరారు.

# రాజీవ్‌కాలనీ పంచాయతీలో శాంతి ర్యాలీ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జమ్ము కాశ్మీర్ పహల్గాంలో జరిపిన ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాసంఘాల నేతలు అన్నారు. పహల్గాం ఉగ్రహదాని నిరసిస్తూ సోమవారం రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళి అర్పించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కాలనీ పెద్దలు కాశీం, హుస్సేన్, మసూద్, హజీసాబ్, మహమ్మద్ అలీ, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, కాలనీ నాయకులు హిరా, వలి, ప్రకాష్, వెంకట, ఇస్మాయిల్, కెవిపిఎస్ డేవిడ్, వెంకటేష్, భాష, గౌస్, వన్నూర్ పాల్గొన్నారు.

### పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

పహల్గాం దుర్ఘటనకు అనంతపురం విశ్రాంతి ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సర్కిల్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఉగ్రవాదాన్ని అణచివేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప, సలహాదారు గోవింద రాజులు, జె.రవీంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ కుమార్, నారాయణ, సంయుక్త కార్యదర్శులు క్రిష్టప్ప, పుల్లప్ప, వేణుగోపాల్, మధుసూదన్, జయరాం పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల్ని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

**గుత్తి :** కాశ్మీర్ లోని పెహల్గాంలో పర్యాటకులను హత్య చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, నాయకులు బి.రామకృష్ణ, ఎన్.రేణుక డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ గుత్తిలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ కూడలి మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకూ సాగింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యు. మల్లికార్జున, రేవతి,రామేశ్వరి, నారాయణస్వామి,మారి, రామ,బావమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# మేడేను జయప్రదం చేయండి

**తాడిపత్రి :** పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఎపి మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఇంజినీరింగ్ సెక్షన్ విభాగం కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడానికి మే 20వతేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమాగౌడ్, రామాంజనేయులు, జుబేర్, మున్సిపల్ ఇంజనీర్ సెక్షన్ విభాగం నాయకులు శ్రీరాములు, మహబూబ్‌బాషా, రాము, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

# వైసిపి జిల్లా యూత్ సెక్రటరీగా సాయికృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సోహెల్

**నార్పల :** వైసిపి జిల్లా యువజన విభాగ కమిటీలో నార్పల మండలంలో ఇద్దరికి చోటు లభించింది. జిల్లా యూత్ సెక్రటరీగా గువ్వల సాయికృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సోహెల్‌తన్వీర్‌ను నియమిస్తూ అధినేత జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో వైసిపి అభ్యున్నతి, అభివృద్ధికి శక్తివంచన కృషి చేస్తామన్నారు.

# సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

**నార్పల :** మండలంలోని సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని కేసేపల్లి, నడిమిదొడ్డి, సిద్ధరాచెర్ల సచివాలయలను ఎంపిపి నాగేశ్వరరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. వీరిలో కొంతమంది సమయానికి అనుగుణంగా విధులకు హాజరు కాకపోవడంతో మెమోలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరూ కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. అత్యవసర సమయంలో మాత్రమే సెలవు పెట్టుకోవాలని సూచించారు.

# అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

**గుంతకల్లు రూరల్ :** అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ అఖిలభారత రైతు కూలి సంఘం నాయకులు ఆర్‌డిఒ శ్రీనివాసులుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐకెవై జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇంటి పట్టాతో పాటు పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ కూలీ సంఘం నాయకులు జక్కన్న, సంజప్ప, నాయకురాళ్లు లక్ష్మి, సరోజమ్మ, కళావతి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి జిల్లా యువజన విభాగం సభ్యులుగా గోపీయాదవ్

**శింగనమల :** వైసిపి జిల్లా యువజన విభాగం కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శింగనమలకు చెందిన జెల్లి గోపీయాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీమంత్రి సాకే శైలజానాథ్, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పని చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

# రాయితీ ట్రాక్టర్ పరికరాలకు సంప్రదించండి

**శింగనమల :** మండలంలోని చిన్న, సన్నకారు రైతులు సబ్సిడీ ట్రాక్టర్ పరికరాల కోసం మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యకు డిమాండ్

**ఉరవకొండ :** ప్రభుత్వ నిబంధనలను నీరుగారిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ వేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరించి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సిఎస్ జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

**యాడికి :** మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం పక్కన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పండు అనురాధ, పండు శ్రీరాములు, గండికోట లక్ష్మణ్, నరసింహులు, కుళ్లాయప్ప, శ్రీనివాసులు, రాజు, రామాంజి, నాగార్జున, ఆనంద్, శ్రీధర్ పాల్గొన్నారు.

# టీనేజీ గర్భధారణను నివారిద్దాం

**ఉరవకొండ :** టీనేజీ గర్భధారణ నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దామని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి పావని పిలుపునిచ్చారు. సోమవారం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూస్తే టీనేజీ గర్భధారణను తప్పకుండా అడ్డుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు బైండోవర్

**పుట్లూరు :** మండలంలోని ఎస్.గూడూరు, చాలువేముల, తదితర గ్రామాలకు చెందిన ఐదుగురు రౌడీషీటర్లను సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వెంకట్‌నరసింహ తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రౌడీషీటర్లను బైండోవర్ చేసి తహశీల్దార్ శేషారెడ్డి ముందు హాజరు పరిచినట్లు తెలిపారు.

# బోద వ్యాధి నిర్ధారణ పరీక్షలు

**నార్పల :** మండల కేంద్రంతోపాటు బి.పప్పూరులో వైద్య ఆరోగ్య సిబ్బంది ఫైలేరియా (బోద వ్యాధి) నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా నార్పల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, బి.పప్పూరు వైద్యాధికారి డాక్టర్ హాజీరా ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆరోగ్య సిబ్బంది 12 బృందాలుగా విడిపోయి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, నార్పల ఆరోగ్య పర్యవేక్షకుడు అక్కులప్ప, బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకుడు శ్రీరాములు, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగాసన పోటీలకు శిక్షణ

**అనంతపురం :** అనంతపురం జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే యోగా పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చేనెల 1వతేదీ నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. పూర్తి వివరాలతోపాటు రిజిస్ట్రేషన్ కోసం సెల్.. 94412 52258, 93939 38449 నెంబర్లను సంప్రదించాలన్నారు.